సాక్షి తిరుపతి

మంగళవారం, 18, జూలై, 2023



పోటెత్తిన భక్తజనం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం, అమావాస్య కావడంతో భక్తులు బారులు తీరారు. - 8లో



భద్రం.. భూగర్భ జలం

జిల్లాలో భూగర్భ జలాలు భద్రంగా ఉన్నాయి. మండే వేసవిలోనూ స్థిరంగా నిలబడ్డాయి. గత ఏడాది కంటే నీటి నిల్వలు పెరిగాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	28
చిత్తూరు	36	27
తిరుమల	32	23
గూడూరు	36	29
నగరి	37	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,170 మంది స్వామివారిని దర్శించుకోగా.. 31,128 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

స్పందనకు 178 వినతులు



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 178 వినతులు అందినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. జేసీ డీకే బాలాజీ, డీఆర్వో కోదండరామిరెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులతో కలిసి అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 114 అర్జీలు వచ్చినట్టు వెల్లడించారు.

44 ఆర్టీసీ దుకాణాలకు టెండర్లు


తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ల పరిధిలో ఖాళీగా ఉన్న 44 దుకాణాలకు ఈనెల 20వ తేదీన టెండర్లు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి జిల్లా ప్రజారవాణాధికారి జితేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి ఆయా డిపోల పరిధిలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

నేడు జగనన్న తోడు 7వ విడత

- జిల్లాలో 23,210 మంది చేతువృత్తుల వారికి లబ్ధి

తిరుపతి అర్బన్: జగనన్న తోడు 7వ విడత కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. అదే సమయంలో ఉదయం 11 గంటలకు లబ్ధిదారులు వీక్షించడానికి వీలుగా తిరుపతి కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి జగనన్న తోడు పథకంలో భాగంగా బ్యాంక్‌లో తీసుకున్న రుణానికి వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోందని, ఇందులో భాగంగా 7వ విడత జిల్లాలో 23,210 మందికి రూ.47,86,155 వడ్డీ జమ కానుందని వెల్లడించారు.

శ్రీవారి ఆలయంపై విమానం



శ్రీవారి ఆలయంపై వెళుతున్న విమానం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయం పైనుంచి విమానం వెళ్లిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. విమానం రేణిగుంట విమానాశ్రయం నుంచి వచ్చిందా.. లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిందో తెలియడం లేదు. ఆగమశాస్త్ర నియమం ప్రకారం తిరుమల ఆలయంపై ఎటువంటి విమానాలు వెళ్లరాదు. అయితే తరచూ ఆలయ పైభాగంలో విమానాలు వెళుతున్నాయి. తాజాగా ఘటన నేపథ్యంలో టీటీడీ భద్రతాధికారులు పరిశీలిస్తున్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించి పరవశించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆదుకున్నాం.. ఆదరించండి

'కుప్పం నియోజకవర్గంలో గత 35 ఏళ్లుగా చంద్రబాబు చేయలేని అభివృద్ధిని నాలుగేళ్లలోనే చేశాం.. ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు చర్యలు చేపట్టాం.. పురపాలక ప్రగతిని పరుగులు తీయిస్తున్నాం.. ప్రతి కుటుంబానికి మేలు చేకూరేలా పథకాలు అందిస్తున్నాం.. వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాం.. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం.. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం.. జనం కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నాం.. ఆపద వేళ ఆదుకుంటున్నాం.. ఆశీర్వదించి ఆదరిస్తే మరింత అండగా ఉంటాం' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

- సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు
- రూ.కోట్ల వ్యయంతో కుప్పం అభివృద్ధి
- సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ప్రజలను మోసం చేసేందుకే బాబు డ్రామాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు

కుప్పం(శాంతిపురం) : మేలు చేసిన నాయకుడిని, ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కుప్పం పట్టణంలో నిర్వహించిన వార్డు బాటలో డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సభల్లో ఆయన ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ కుప్పం పురపాలక పరిధిలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గ్రాంటుగా రూ.60 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు రూ.16కోట్లు విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. డీకే పల్లె, వీరప్పనాయుని చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా తీర్చిదిద్ది కుప్పం వాసులకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నట్లు వివరించారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా సొంత నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చుకోలేకపోయారని, ఒక్క లేఖతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కలను సాకారం చేశారని తెలిపారు. 35 ఏళ్లుగా చంద్రబాబు ఏం మేలు చేశారో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఒకటో వంతు కూడా చంద్రబాబు ఇవ్వలేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసం ట్రాక్టర్‌కు డేరా కట్టి అన్న కాంటిన్ అంటూ నాటకాలు ఆడారని విమర్శించారు. అదే రాజన్న క్యాంటిన్ ద్వారా ఉదయం, మధ్యాహ్నం పేదలకు నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. పేదలకు ఎవరు మేలు చేసినా తాము సహకరిస్తామని, చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ మాత్రం జనహితం మరిచి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కుప్పంలో టీడీపీ కనుమరుగైందని, అందుకే ప్రకాశం జిల్లా నుంచి తన బంధువు శ్రీకాంత్‌ను చంద్రబాబు ఇన్‌చార్జిగా తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు అభిమానంతో ఓట్లు వేసినా కుప్పంలో భరత్‌కు లక్ష ఓట్లు వస్తాయని తెలిపారు. వైఎస్సార్ సీపీని గెలిపిస్తే తామంతా సేవకుల్లా, సైనికుల్లా ప్రజల కోసం పని చేస్తామన్నారు. 2014లో రైతులు, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు పూర్తిగా ఏమార్చారని విమర్శించారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో మాఫీ చేశారని వెల్లడించారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2,300 పైచిలుకు వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వెల్లడించారు. చంద్రబాబు కుప్పంలో ఓడిపోవడం ఖాయమన్నారు. బాబుకు ఓటు వేస్తే కుప్పంలో మళ్లీ ఆయన అనుచరుల అరాచక రాజ్యమే కొనసాగుతుందని హెచ్చరించారు. బాబు హయాంలో టీడీపీ స్థానిక నాయకుల కబంధ హస్తాల్లో ప్రజలు నానా అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే కేబినెట్‌లోకి తీసుకుని, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత సహకరిస్తారని వివరించారు. కరోనా వేళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ఆయన కొడుకు హైదరాబాద్‌లో దాక్కున్నారని, భరత్, వలంటీర్లు స్థానిక నాయకులు ధైర్యంగా సేవలందించారని వెల్లడించారు.

బలహీన వర్గాల శత్రువు బాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు శత్రువులా చూస్తారని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. చంద్రబాబు స్వగ్రామం నారా వారిపల్లిలోని దళిత కాలనీలో టీడీపీవారు కనీసం ఓటు కూడా అడగరన్నారు. దళితులను ఓటు వేయడానికి రానివ్వకుండా రిగ్గింగులకు పాల్పడిన చరిత్ర వారిదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే దళితులకు లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. అగ్రవర్ణాల పిల్లలతో సమానంగా దళిత బిడ్డలకు కూడా నాణ్యమైన మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, ఇతర సదుపాయాలు అందిస్తున్నారని వివరించారు. బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావును రాజ్యసభకు పంపిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పాల్గొన్నారు.

పుష్ప పల్లకీపై పురుషోత్తముడు



పుష్పపల్లకీ సేవకు పోటెత్తిన భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పకు హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కలిసి మలయప్పస్వామివారు గరుత్మంతుడికి అభిముఖంగా.. మరో పీఠంపై స్వామివారి స్వరసైనాధ్యక్షుడైన శ్రీవిశ్వక్సేనుల వారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేశారు. అనంతరం హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి ఆణివార ఆస్థానాన్ని ముగించారు. సాయంత్రం పుష్పపల్లకీ సేవ వైభవంగా సాగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. సుమారు టన్ను పుష్పాలతో పుష్పపల్లకీని అలంకరించారు. టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు మూరంశెట్టి రాములు, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, పేష్కార్ శ్రీహరి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, విజీఓ బాలిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆణివార ఆస్థానానికి వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు



పుష్పపల్లకీ సేవకు బారులు తీరిన భక్తులు

పేదలకు తక్కువ ధరకే 'ఆహా'రం



నగరిలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నగరి : తక్కువ ధరకే నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారం అందించేందుకు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను మంత్రి ఆర్‌కే రోజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటిన్‌లో ఆహారం కొనుగోలు చేశారు. అలాగే మెప్మా ఏర్పాటు చేసిన ఫుడ్‌మేళాను ప్రారంభించి వంటకాలను రుచి చూశారు. ఫుడ్ చాలా బావుంది అంటూ మహిళలను ప్రశంసించారు. మంత్రి మాట్లాడుతూ వివిధ పనుల నిమి త్తం పల్లెల నుంచి పట్టణాలకు వచ్చేవారికి తక్కువ ధరకే భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆహా క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలు వీటిని నిర్వహిస్తాయన్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆస్పత్రుల ఆవరణల్లో తాత్కాలికంగా టెంట్లు వేసి స్టాళ్లు ఏర్పాటు చేసి ఆహారం విక్రయిస్తారని వివరించారు. ఈ స్టాల్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంఘ సభ్యులకు ప్రతి నెలా రూ.500 చొప్పున టౌన్ లెవల్ ఫెడరేషన్‌కు జమ చేసే సదుపాయంతో రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 ప్రాంతాల్లో 140 యూనిట్లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. త్వరలో నగరి పట్టణంలో అర్బన్ మహిళా మార్ట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వెటర్నరీ ఏడీ వాసు, మెప్మా డీపీఎంయూలు బాబు, జయరాం, టీఎల్ఎం సునీత, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, వెంకటరత్నంరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో ఏ మేలూ పొందలేదు

- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : 'ఏళ్ల తరబడి టీడీపీలో ఉన్నాం. జెండా మోశాం. మాకు ఎప్పుడూ ఇంత లబ్ధి చేకూరలేదు. ప్రజలకూ మేలు చేకూరలేదు. రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరన్న చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాం' అని పురంధర్, హరి తెలిపారు. తిరుపతి కొర్లగుంటలో టీడీపీ నుంచి పురంధర్, హరి సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం తపించే నాయకులు జగనన్న, కరుణన్న అని కొనియాడారు. తిరుమలలో ఎంతో మంది దుకాణదారులు వారి షాపులను రెన్యూవల్ చేసుకోలేక, కొనుగోలు చేసిన షాపులు, తండ్రి నుంచి తనయుల పేరుమీద మార్చుకోలేక ఇబ్బందులు పడేవారని, అలాంటి సమస్యను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే భూమనకే దక్కిందని తెలిపారు. రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు లాగా ప్రజలను మోసం చేసే వాగ్దానాలు జగనన్న చేయలేదన్నారు. టీడీపీ పాలనలో ఏనాడూ నాయకులకుగానీ, ప్రజలకు కానీ చంద్రబాబు చిన్నపాటి లబ్ధికూడా చేకూర్చిన పాపాన పోలేదని ఆవేదన చెందారు. ఇప్పుడు రాజకీయ లక్ష్యమే లేని పవన్‌కళ్యాణ్‌తో కలిసి మరోసారి అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పరిశీలించారు. సీఎం పర్యటన రూట్‌మ్యాప్, బహిరంగ సభ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ పర్యటన రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కేంద్రం మెచ్చిన పోలీస్‌స్టేషన్!

నాడు: చుట్టూ ముళ్లపొదలు.. ఏ మూల చూసినా పాముల పుట్టలు.. దశాబ్దాలుగా గుట్టలుగా పడి శిథిలావస్థకు చేరుకున్న వాహనాలు.. అస్తవ్యస్త పార్కింగ్.. కళావిహీనంగా చెట్లు.. సరైన బోర్డు కూడా లేని పోలీస్ స్టేషన్..రంగులు వెలిసి పాత భవనాలను తలపించే దుర్గంధంతో సిబ్బంది ఇబ్బందిగా పనిచేసేవారు. అస్తవ్యస్తంగా ఉండేది తిరుపతి జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్.



అస్తవ్యస్తంగా పార్కింగ్

నేడు : ఒక అధికారి బదిలీపై అక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కేవలం 20 రోజుల్లోనే స్టేషన్ రూపురేఖలు మార్చారు. భవనాలకు అందమైన రంగులు వేయించాడు. ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తీయించాడు. చెట్లను ట్రిమ్మింగ్ చేయించారు. వాహనాలను స్టేషన్ వెనుక పార్కింగ్ చేయించారు. స్టేషన్‌కు వచ్చేవారు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చిన్నసైజు పార్క్‌ను తీర్చిదిద్దారు. స్టేషన్‌లో రికార్డు రూమును డిటలైజ్ చేసి అందమైన ర్యాక్‌లతో వాటిని ముస్తాబు చేశారు. సిబ్బందికి విశ్రాంతి గదినీ ఏర్పాటు చేశారు.



చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు

తిరుపతి రూరల్: చంద్రగిరి పీఎస్‌లో నూతనంగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ స్టేషన్ రూపురేఖలను మార్చేశారు. ఇది చూసి చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆయన్ను అభినందించారు. రాష్ట్ర డీజీపీ ద్వారా సమాచారం అందుకున్న ఢిల్లీకి చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(బీపీఆర్‌డీ) బృందం ఇటీవల చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించింది. స్టేషన్ ప్రాంగణం, వివిధ సమస్యలపై వచ్చే అర్జీదారులకు అందిస్తున్న సేవలు, రికార్డుల మెయింటెనెన్స్ వంటి అంశాలను పరిశీలించింది. ఇతర స్టేషన్లతో పోల్చితే ఇక్కడ ఏర్పాట్లు, పరిసరాల శుభ్రత, రికార్డుల నిర్వహణ భేషుగ్గా ఉన్నాయని బీపీఆర్‌డీ బృందం పర్యవేక్షణాధికారి బాలచంద్రన్ చంద్రగిరి సీఐ రాజశేఖర్‌ను అభినందించారు. త్వరలో బీపీఆర్‌డీ జాతీయస్థాయిలో పోలీస్ స్టేషన్లకు ర్యాంకులు కేటాయించనున్నారు. అయితే అద్భుతంగా తీర్చిదిద్దిన చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు అత్యుత్తమ ర్యాంకు వచ్చే అవకాశం ఉందని తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మనసు పెడితే స్టేషన్లను అద్భుతంగా తీర్చిదిద్దవచ్చని నిరూపించిన సీఐ రాజశేఖర్‌ను పలువురు పోలీస్ అధికారులు అభినందిస్తున్నారు.



క్రమపద్ధతిలో పార్కింగ్ చేసిన పాత వాహనాలు

భద్రం.. భూగర్భ జలం

జిల్లాలో భూగర్భ జలాలు భద్రంగా ఉన్నాయి. మండే వేసవిలోనూ స్థిరంగా నిలబడ్డాయి. గత ఏడాది కంటే నీటి నిల్వలు పెరిగాయి. దీంతో తిరుపతి జిల్లా సేఫ్‌జోన్‌లో కొనసాగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఇరవై ఏళ్లలో తీవ్రమైన ఎండలు నమోదైనా నీరు పైనే ఉండడం ఇదే తొలిసారని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయానికి సమృద్ధిగా జలాలు అందుబాటులో ఉంటాయని వివరిస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.

- సేఫ్ జోన్‌లో తిరుపతి జిల్లా
- నగటు నీటి మట్టం 4.86 మీటర్లు
- చిట్టమూరు మండలంలో 0.08 మీటర్లు
- తిరుపతిలో 21.45 మీటర్లు
- గత ఏడాది కంటే 0.59 మీటర్లు పెరిగిన నీరు
- 27 శాతమే వినియోగం
- మిగులు 73 శాతం


చిట్టమూరు మండలంలో బోరు మోటారు


నీటి మట్టాన్ని కొలుస్తున్న భూగర్భజలశాఖ అధికారులు

తిరుపతి అర్బన్ : ఈ ఏడాది భానుడు ఉగ్రరూపం దాల్చినా జిల్లా సేఫ్‌జోన్‌లోనే ఉంది. భూగర్భజల మట్టం అనూహ్యంగా పెరిగింది. గత టీడీపీ పాలనలో దాదాపు నాలుగేళ్లపాటు ఈ ప్రాంతం రెడ్‌జోన్‌లో ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితిలో గణనీయంగా మార్పు వచ్చింది. జిల్లాలోని 34 మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 64 ఫిజోమీటర్ల ఆధారంగా భూగర్భజలవనరులశాఖ అధికారులు సేకరించిన తాజా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. జూన్ లెక్కల ప్రకారం జిల్లా సగటు నీటిమట్టం 6.16 మీటర్లుగా నమోదైంది. ప్రధానంగా చిట్టమూరు మండలం యాగసిరి గ్రామంలో కేవలం 0.08 మీటర్ల లోతులోనే సమృద్ధిగా నీటినిల్వలు ఉన్నాయి. ఒక్క తిరుపతి మినహా మిగిలిన ప్రాంతాల్లో 0.08 మీటర్ల నుంచి 8.5 మీటర్లకే నీటి మట్టం చేరుకుంది. తిరుపతి అర్బన్ ప్రాంతంలో మాత్రమే 21.45 మీటర్ల లోతులో నీటి నిల్వ ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. రెండు దశాబ్దాలను గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది తీవ్రమైన ఎండలు నమోదైనా భూగర్భజలాలు పైనే ఉండడం ఇదే మొదటిసారని నిపుణులు పేర్కొంటున్నారు.

వినియోగం తక్కువే..!

ప్రతి నెలా భూగర్భ జలమట్టాన్ని అధికారులు లెక్కకడుతుంటారు. అందులో మే నుంచి జూన్‌కు సంబంధించి కీలకంగా భావిస్తారు. ఈ ఏడాది జూన్ లెక్కల ప్రకారం 27శాతం మాత్రమే భూగర్భజలాలను వినియోగించినట్లు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో 73శాతం జలాలు మిగులు ఉన్నట్లు నివేదించారు.

జిల్లా సమాచారం

బోర్లు, బావుల సంఖ్య	: 91,504
మొత్తం భూగర్భ జలాలు	: 1,72,162 హెక్టో మీటర్లు
వినియోగించింది	: 45,011 హెక్టో మీటర్లు
మిగులు జలాలు	: 1,27,151 హెక్టో మీటర్లు

(హెక్టోమీటర్ అంటే లక్ష లీటర్లు)

ప్రధాన వనరు తెలుగు గంగ

తెలుగు గంగ కాలువ ప్రారంభించి సుమారు 35 ఏళ్ల పూర్తి కావస్తోంది. అయితే ఎప్పుడూ ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు విడుదల చేయలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2020–23 వరకు వరుసగా రబీతోపాటు ఖరీఫ్‌కు సైతం సాగునీరు అందించారు. దీంతో సాధారణ సాగుకు అదనంగా 80వేల నుంచి 90వేల ఎకరాలు సస్యశ్యామలంగా మారాయి. దీంతో తెలుగు గంగ కాలువ పరిసర మండలాల్లో భూగర్భ జల మట్టం స్థిరంగా ఉంటోంది. అలాగే జిల్లాలోని అరణియార్, కాళంగి, మల్లిమడుగు రిజర్వాయర్లు ,కల్యాణీడ్యామ్, తొండమనాడు చెరువుతోపాటు పలు వాగులు, వంకల్లో పుష్కలంగా నీరు ఉండడంతో భూగర్భ జలలు నిలకబగా ఉన్నట్లు నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా నీరు



ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాల సమృద్ధిగా ఉన్నాయి. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా నీరు అందుబాటులో ఉంది. జిల్లా సురక్షిత జాబితాలో స్థిరంగా కొనసాగుతోంది. రెడ్‌జోన్ కింద జిల్లాలోని ఏ ప్రాంతం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో రైతులు రెండు పంటలు సాగుచేస్తున్నారు.
– నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భజలవనరులశాఖ

వరుణుడు మనవైపే...



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో వర్షాలు సకాలంలో పడేవి. దీంతో రెండు పంటలు పండించుకునేవాళ్లం. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు తీవ్రమైన కరువును ఎదుర్కొన్నాం. మళ్లీ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాతే వరుణుడు మన వైపునకు వచ్చేశాడు. మా మండలంలో నీరు పైనే ఉంది.
– కుంభాల మస్తానయ్య, రైతు, వాకాడు మండలం

సాగు విస్తీర్ణం పెరిగింది



జిల్లాలోనే భూగర్భ జల మట్టంలో మా మండలం ముందుందని అధికారులు చెప్పారు. వేసవిలో కూడా నీరు పైనే ఉంది. ఇక వర్షాకాలం అయితే చెప్పాల్సిన అవసరం లేదు. సాగునీటికి ఇబ్బంది లేకపోవడంతో వ్యవసాయం చేసే విస్తీర్ణం పెరిగింది. ధైర్యంగా రెండు పంటలు పండించుకుంటున్నాం. ప్రభుత్వం సైతం అండగా ఉంటోంది.
– కలపాటి రాంబాబు, రైతు, చిట్టమూరు మండలం

క్లుప్తంగా

మృతులు నెల్లూరు వాసులు

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఇద్దరు యువకులు నెల్లూరుకు చెందిన వారుగా రూరల్ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. వారు సోమవారం ఉదయం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. నెల్లూరు ఇరగాలమ్మ గుడి ప్రాంతంలోని సాయినగర్‌కు చెందిన సయ్యద్ సమీర్(17), గిడ్డంగి వీధికి చెందిన షేక్ సోహెల్ అక్రమ్(20) నెల్లూరులో బంగారు పనిచేస్తుంటారని, ఆదివారం రాత్రి ఎంజీమాల్‌కు వెళుతున్నామని చెప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గూడూరు ప్రాంతం వైపు ఎందుకు వచ్చారో తెలియదన్నారు. మృత్యువు తమ బిడ్డలను పొట్టనబెట్టుకుందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి


దర్గాకు వైద్య సేవలందిస్తున్న 108 ఈఎన్‌టీ

సైదాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తురిమెర్ల గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆ యువకుడిని 108 సిబ్బంది రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసుల కథనం..మండలంలోని తురిమెర్ల గ్రామానికి చెందిన బట్టా దర్గా(30) హైయ్యర్ బస్సులకు తాత్కాలిక డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. ఆదివారం రాత్రి డ్యూటీ దిగి గూడూరు నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. తురిమెర్ల–ఊటుకూరు మార్గంలో ఎదురుగా వస్తున్న బర్రెను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. సైదాపురం 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బట్టా దర్గాకు వైద్య సేవలందించినా ఫలితం లేకపోయింది. అప్పటికే దర్గా మృతి చెందినట్లు 108 ఈఎన్‌టీ నిర్ధారించారు. సోమవారం ఎస్‌ఐ వాసు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

హత్యా..ఆత్మహత్యా?

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం సమీపంలో పంట పొలాల్లో సుమారు 30 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తుతెలియని యువకుడు చెట్టుకు ఉరేసుకుని మృతిచెంది ఉండడాన్ని సోమవారం రూరల్ పోలీసులు గుర్తించారు. దుర్గంధం వస్తుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహం తీరును పరిశీలిస్తే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. కేసు దర్యాప్తులో ఉంది.

తిరుపతి బులియన్



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,110
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,488
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,200
రిటైల్ వెండి గ్రాము	రూ.79.20

ముక్కంటి సేవలో ఎస్సీ కమిషన్ చైర్మన్


ఆలయ ధ్వజస్తంభం వద్ద రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

సోమల : మండలంలోని మేటిమంద మార్గంలో నేటి ఆంజనేయస్వామి గుడి వద్ద బైక్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. సదుం మండలం నాయనపాకాలకు చెందిన రెడ్డెప్ప, ఎర్రనాగులవారిపల్లెకు చెందిన మునిరత్నం, పిల్లలు తేజేష్, సాత్విక్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు రెడ్డెప్ప, మునిరత్నం, తేజేష్‌ను స్థానికులు సోమల పీహెచ్‌సీకి తరలించారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం


గోవిందరాజ స్వామి ఆలయంలో వస్త్రాలను ప్రదర్శనగా తీసుకు వస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో సోమవారం సాయంత్రం ఆణివార ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు ఆణివార ఆస్థానం. నాటి నుంచి టీటీడీ ఆదాయ వ్యయాలు, నిల్వలు, వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి, ఏప్రిల్ నెలలకు మార్చారు. ఆణివార ఆస్థానంలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారిని వేంచేపు చేసి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం గరుడాళ్వార్ ఎదురుగా సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు.
అనంతరం స్వామివారు హనుమంత వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు. అలాగే అలిపిరి పాదాల మండపం వద్దనున్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోనూ ఆణివార ఆస్థానం నిర్వహించారు.

ముక్కంటి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముక్కంటి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అమావాస్య కావడంతో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శన ఏర్పాట్లు చేశారు. సుమారు 35 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 3,310 మంది భక్తులు, రూ.50 ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా 1,890 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టికెట్ల ద్వారా 4,344, రూ.750 టికెట్ల ద్వారా 1,877మంది, రూ.1,500 టికెట్ల ద్వారా 615మంది, రూ.2,500 టికెట్ల ద్వారా 416, రూ.5వేల టికెట్ల ద్వారా 106మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు 31,500 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

డీటీడీసీ కొరియర్‌కు కమిషన్ వడ్డన

తిరుపతి లీగల్: సేవా లోపానికి పాల్పడినందుకు డీటీడీసీ కొరియర్ సంస్థ ఫిర్యాది పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ సోమవారం తీర్పుచెప్పింది. ఫిర్యాది తరుపు న్యాయవాది వాన శ్రీనివాసులు తెలిపిన కేసులోని వివరాల మేరకు.. తిరుపతి వరదరాజనగర్‌కు చెందిన ఎస్.నాగేశ్వరరావు గత ఏడాది ఆగస్టు 30న తన తమ్ముడు సత్యసాయి జిల్లా, కదిరిలోని ఎస్.ఉమామహేశ్వరరావుకు ఒక కవరును స్థానిక కేటీ రోడ్డులోని సుజా టెలిలింక్స్ అండ్ డీటీడీసీ సబ్ ఏజెంట్ ద్వారా పంపారు. రెండు రోజుల తర్వాత కొరియర్ పంపిన కవరు ఏ స్థితిలో ఉందో తెలుసుకునేందుకు సుజా టెలిలింక్స్ షాపునకు వెళ్లి విచారించారు. ఆ షాపు యజమాని ఆ కవరును తిరుపతి ఆటోనగర్, రేణిగుంట రోడ్డులోని డీటీడీసీ హెడ్ ఆఫీస్‌కు పంపామని సమాధానం ఇచ్చారు. తర్వాత నాగేశ్వరరావు మరుసటి రోజు షాపునకు వెళ్లి విచారించగా హెడ్ ఆఫీస్‌లోని ఓ ఇన్‌చార్జ్ ధనంజయులు సెల్ నంబర్ ఇచ్చి వివరాలను అతన్ని అడిగి తెలుసుకోవాలని సూచించాడు. ఫిర్యాది నాగేశ్వరావు అతనికి ఫోన్ చేయగా కవరు వివరాలను తనకు వాట్సాప్ ద్వారా పంపితే ఎక్కడ ఉందో చెబుతానని తెలిపారు. నాగేశ్వరరావు తన ఫోన్ ద్వారా వివరాలు పంపాడు. ఆపై 20 సార్లుకుపైగా ఫోన్ చేసినా అతను స్పందించలేదు. కవరు అతని తమ్ముడికి పది రోజులైనా చేరలేదు. దీనిపై అతను సుజా టెలిలింక్స్, డీటీడీసీ కొరియర్ హెడ్‌ఆఫీస్, బెంగళూరులోని డీటీడీసీ ఎక్స్‌ప్రెస్ లిమిటెండ్ ప్రధాన కార్యాలయానికి నోటీసు పంపి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషన్ అధ్యక్షుడు పార్థసారథి, సభ్యులు నాగశశిధర్‌రెడ్డి, స్నేహలతాలు ఫిర్యాది నాగేశ్వరరావు కొరియర్‌కు చెల్లించిన రూ.80ని అతనికి కొరియర్ సంస్థ చెల్లించాలని తీర్పు చెప్పారు. అలాగే అతను ఫిర్యాదు దాఖలు చేసిన తేదీ నుంచి నష్టపరిహారం కింద రూ.1000కి 9 శాతం వడ్డీ లెక్కన చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. అలాగే ఫిర్యాదు ఖర్చుల కింద రూ.2000ను 45 రోజుల్లోపు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ప్రియురాలు దక్కలేదని హత్యాయత్నం


ఉన్మాది దాడిలో గాయపడ్డ భార్యాభర్తలు

డక్కిలి: ప్రియురాలు దక్కలేదన్న నెపంతో యువతి తల్లిదండ్రులపై ఉన్మాది హత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన తులసి జగదీష్, ఆయన భార్య సుజాత ఇరవై ఏళ్లుగా డక్కిలిలో టిఫన్, టీ దుకాణాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె అనిత స్థానికంగా ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో శ్రీకాళహస్తి మండలం, వాగవేడుకు చెందిన గిరి ప్రేమ పేరుతో వెంటపడ్డాడు. వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో అనిత తల్లిదండ్రులు ఆ యువతిని రాజస్థాన్‌కు తీసుకెళ్లి వేరొకరితో వివాహం చేశారు. తర్వాత 15 రోజుల క్రితం తిరిగి వారు డక్కిలికి వచ్చి యథావిధిగా టిఫిన్ దుకాణం నడుపుకుంటున్నారు. తన ప్రియురాలిని దూరం చేశారనే నెపంతో యువతి తల్లిదండ్రులపై గిరి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి టిఫిన్ సెంటర్‌కు వచ్చిన గిరి ఒక్కసారిగా రాడ్‌తో జగదీష్, సుజాతపై దాడికి తెగబడ్డాడు. వారిని 108లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గిరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ సందర్శన


తాళపత్ర గ్రంథాల విశేషాలను వివరిస్తున్న ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగపు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు సోమవారం ఎస్వీయూలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను సందర్శించారు. తాళపత్ర గ్రంథాల రక్షణ, పరిష్కరణలో చేపట్టిన, చేపడుతున్న చర్యలను డాక్టర్ రాజశేఖర్ విద్యార్థినులకు వివరించారు. లిపి పూర్వోత్తరాలు, లిపిలో జరిగిన మార్పులు, తాళపత్రాలను ఏ విధంగా తయారు చేసేవారు, వాటిపై రాసే పద్ధతులు, భద్రపరిచే తీరుపై అవగాహన కల్పించారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు పరిశోధకులకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పీసీ.వెంకటేశ్వర్లు, మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి, వై.సుభాషిణి, డి.యువశ్రీ, బి.లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

గ్రీన్‌టెక్ పరిశ్రమ ఉద్యోగి అనుమానాస్పద మృతి



మృతిచెందిన నాగేంద్రబాబు, కన్నీటి పర్యంతమవుతున్న మృతుడి తండ్రి, కుటుంబ సభ్యులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్ పరిధి, కోనేటిరాజుపాళెం గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ పరిశ్రమ ఉద్యోగి కిన్నెర నాగేంద్రబాబు(33) పరిశ్రమ వద్ద అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడాన్ని సోమవారం అక్కడి ఉద్యోగులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం.. వెంకటగిరి పాతమంబపురం ప్రాంతానికి చెందిన నాగేంద్రబాబు, గ్రీన్‌టెక్ పరిశ్రమలో ఓ ప్లాంట్ ఇన్‌చార్జిగా 12 ఏళ్లగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పరిశ్రమ వద్దకు వచ్చి తన బైక్ బయట పార్కింగ్ చేసి లోపలి వెళ్లాడు. సోమవారం ఉదయం పరిశ్రమ బస్సులు పార్కింగ్ చేసే స్థలంలో నాగేంద్రబాబు మృతిచెంది పడి ఉన్నాడు. మద్యం మత్తులో పరిశ్రమ వద్దకు వచ్చి బస్సులు పార్కింగ్ చేసే స్థలంలో నిద్రపోయి ఉండడంతో ఏదైన బస్సు కిందపడి మృతిచెందాడా.. మరేదైనా కారణమా? అనే కోణంలో విచారిస్తున్నట్టు సీఐ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు తెలిపారు.

ఇది హత్యే?

హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని మృతుడి తండ్రి కిన్నెర పెంచలయ్య పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలో ఎవరో గిట్టని వారు హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నార ఆరోపించారు. మృతుడి బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

ప్రాణం తీసిన హెరిటేజ్ బస్సు


మంజునాథ్ మృతదేహం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, ఎం కొంగరవారిపల్లి సమీపంలో హెరిటేజ్ మినీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం.. సోమల మండలానికి చెందిన మంజునాథ (37) చంద్రగిరి మండలం, బోడింబాయి వద్ద ఓ రైతు దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన సొంత పనుల నిమిత్తం బోడింబాయి నుంచి చంద్రగిరికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెనక నుంచి హెరిటేజ్ మినీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మంజునాథ్ (37) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చంద్రగిరి సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు.